# ★రహదారి మలుపు★

"మూర్తి శ్రీ"

"సత్యం, శివం సుందరమైన నీ భవిష్యజ్జీవానికి యిది ఒకగొడ్డలిపెట్టు...ఏం చేస్తాంఅయిం దేదో అయింది" అని గోవర్ధన్ తండ్రి శివరామయ్య గారు ,యీజీచైర్ మీద కూర్చొని గోవర్ధన్ తో అన్నారు-

"అధైర్యం దేనికి నాన్నా, అయినా కాలేజీ అందరికీ కాదు నాన్నా ధనికులకే...అయినా సామర్థ్యం ఉన్నవారికి ఈ కాలంలో అవకాశాలు లేవు .అందులోనూ మంచి మార్కులొచ్చిన నాకే అన్యాయం చేశారు...నడిదారిలోకి తీసుకొని వచ్చి గోతులోనికి త్రోసేశారు..."

"ఏమిటో...ఈ ప్రపంచాన్ని పాలిస్తున్నది న్యాయమైన దైవంకాదు .అన్యాయాన్ని బలపర్చి దానికి సాక్ష్యమిచ్చే దైవం"

గోవర్ధన్ కాలేజీలో యింటర్ చదువుతున్నాడు మొదటి సంవత్సరం- అధికారులు 'నిధి'లో కొంతధనాన్ని అతనికి సహాయంచేశారు ఈ సంవత్సరం ఆ ఆశ నిరాశచేశారు .గోవర్ధన్ తండ్రి అప్పుడు ఉద్యోగంనుండి రిటైరయిపోయి ఆరు సంవత్సరాలయింది; అతనికి ప్రభుత్వం యిచ్చేది ముప్ఫయిఅయిదు రూపాయిలు పెన్షన్ అందులోనే ఖర్చులు సరిపెట్టుకొని గోవర్ధన్ చదువు సాగించాలి! కాని గోవర్ధన్ తండ్రి శివరామయ్యగారిక్కూ మాత్రం గోవర్ధన్ ని ఎలాగయినా చదివించి, నల్గురిలోగా నెలకొపచ్చకాగితం కళ్ళ చూడాలని ఆశ! తాను దరిద్రపుబాధ పడలేకనే ఉద్యోగాన్ని స్వీకరించవలసి వచ్చింది; ఆ గతి తన కుమారునికి రాకుండా ఉండాలని అతని ఆశయము ..ఆయనలేచి చేతికర్ర పట్టుకొని గుమ్మం దగ్గరకువెళ్ళి "నాయనా! పెన్షన్ తేవడానికి వెళుతాను ..నా జీవితంలో ఒక గొప్ప తప్పిదాన్ని చేశాను నిన్ను! నాకంటే ఎన్నోరెట్లు ఆర్థికంగా గొప్పవాణ్ణిగా చేయాలని ఆశించాను! నిజానికి అదినావిధి—కాని నావిధినేను నిర్వర్తింపలేకపోయాను...కాని ఒక్కటిమాత్రం విను! నీవు రేపు వివాహం చేసుకొన్నతర్వాత పిల్లల చదువుగురించే చాలా జాగ్రత్తపడు" నీ దరిద్రానికి నీపిల్లల భవిష్యజ్జీవితాలను బలిచేయకు—అని మా నాన్నగారు చెప్పినా నేను ఆయనకోర్కె తీర్చలేకపోయాను . మనుమడపైననీపైనాతీర్చు భరించలేని దుర్భరదారిద్ర్యం మానవులలో మానవత్వాన్ని మాయంచేస్తుంది" అన్నారు! ఆయన రోడ్డుమలుపు తిరిగేవరకూ చూస్తూ నిలబడ్డాడు తన యింటిలోనికివచ్చి ఆకుర్చీమీద కూర్చొని యింటి కప్పుకేసి దీక్షగా "మీరైనా సాయం చేయరా అన్నట్టు చూస్తున్నాడు ." తానిప్పుడేం చేయాలి? తనజీవిత సర్వస్వాన్ని ..తన గృహ ప్రాంగణంలో తల విరుగబోసుకుని విహరిస్తున్న దరిద్రదేవత తృప్తికితర్పణం ఈయాలా... చివరకి తనకీ ముప్ఫయి రూపాయల గుమస్తాగిరీ ఖాయమా? తానూఎన్నెన్నోయనికలలు కన్నాడు ఈ సంవత్సరం అయిపోతే యింజనీరింగుకి వెళ్దామనుకున్నాడు. .కానినుదుట బ్రహ్మ ఏనాడో 'గుమస్తా' అనివ్రాసి దిద్దిఉంటాడు ఏనాటికి ప్రపంచంలో సామర్ధ్యం ఉన్నవారికి అవకాశాలు లభించవా? తన ఆశయాలన్నీ కాలప్రవాహంలో కలసి పోవల్సిందేనా? తనస్వప్నసౌధాలన్నీ వాస్తవికతుఫానుచేత కొట్టుకుపోబడవల్సిందేనా...తానూ...తండ్రి...ఇప్పుడు దరిద్రదేవతకి బానిసలు! ఆలోచనలతో అతనిబుర్ర వేడెక్కిపోయింది. సొట్టబడిన బిందెలో మంచినీళ్లు తీసుకొని త్రాగేడు అతనికి 'అమ్మ' జ్ఞాపకంవచ్చింది! "ఎంత మంచిది నాన్నకి ఆమెఅంటే

ప్రాణం! అందుకే తిరుగుబివాహం చేసుకోలేదు - నాన్న బీదవాడు కాని లేకపోతే భార్యపైగల ప్రేమకి తన ఏకపత్నీవ్రతానికి చిహ్నంగా షాజహాన్ లాగ ఏ తాజమహల్ లాంటిదో కట్టేవారు” వీధిలోనికి వెళ్ళాడు; అతని సహాధ్యాయిని వస్తున్నట్లయింది తన యింటికి! తెల్సు తనకి ఇంకా జీవితంలో మిగిలినవి రెండేరెండు వస్తువులు . కాదు రెండేరెండు జీవులు! నాన్న...సహాధ్యాయిని సుజాత! ఆమె అతని యింటిని సమీపించింది ఆమెకి ఓ విషయాన్ని ఎలాగు చెప్పడం... ఆమెని చూస్తూఉంటే ఆనందానికి బదులు దుఃఖం వస్తున్నది! ఆమె ధనవంతురాలు తనుదరిద్రుడు... ఆమె యింటిలోనికి వచ్చింది

‘రా, సుజాతా! కూర్చో’ అని యీజీ చైర్ చూపాడు గోవర్ధన్ విచారంగాఉన్నట్లు గ్రహించింది సుజాత

‘సుజాతా ఈ బీదగృహంలో అడుగుపెట్టావేమి? నీలాంటి ధనికురాలికి యిది నచ్చుతుందా?’

‘అదేంమాట గోవర్ధన్? అవును కానీ నిన్నొక మాట అడుగుదామను కొంటున్నాను . చెబుతావా?’

‘దరిద్రుల హృదయాలలో రహస్యాలా సుజాతా?’

‘నీవీనాడు చాలా విచారంగా ఉన్నావే. . కారణం?’

‘కారణం! క్రిందటి సంవత్సరం ధనసహాయం చేసిన కాలేజీ అధికారులు ఈసంవత్సరం లేదన్నారు’

‘నీకా! కాలేజీ సెకండ్ వచ్చిన నీకా లేదన్నారు? ఎందుకూ పనికిరాని ప్రసాద్ కి ఇచ్చారే’

‘ప్రసాద్ మామ కమిటీ మెంబరు...మా నాన్న కాదుగా .’

“అయితే ఏం చేయదల్చుకున్నావు?”

“చదువు మానేయ దల్చుకున్నాను! ఉద్యోగం చేయదల్చుకున్నాను...గుమస్తాగిరీ ఉన్నాదిగా?”

‘ఛీ . ఎంత నామూషి? ఎంతసిగ్గు?’

‘దరిద్రులకి నామూషి, సిగ్గు, నాశనం అయిపోతాయి! ఆదరిద్రం భరించరాని దైనప్పుడు ’

‘గోవర్ధన్! నా సంగతి నీకు తెల్సు! నీ పైన ఎన్ని ఆశలు పెట్టుకున్నానో నా జీవిత సర్వస్వం నీవేఅని నమ్మాను! ఒక్క సంగతి చెబుతాను . వింటావా?’

‘ప్రాణ సమానమైన నీవు చెప్పేది విననా?’

‘గోవర్ధన్! మాకు కావలసినంత ధనం ఉన్నది మా నాన్నగారితో చెప్పి నిన్ను చదివించమంటాను నా శాయశక్తులా ప్రయత్నిస్తాను! గోవర్ధన్! ప్రాణ సమానమయిన నాకన్యాత్వాన్నే ధారపోయడానికి సిద్ధపడిన నేను ఈచిన్న త్యాగం చేయగలను.

‘సుజాతా! ఏమిటది! నా ప్రేమని ధనానికి అమ్ముకో మంటావా? నీకు న్యాయమా...అసంభవం? ఎంతటి దరిద్రానైనా చిరునవ్వుతో ఎదుర్కొంటాను కాని ఈపని చేయలేను! వెళ్ళు సుజాతా ..వెళ్ళు! ఆసంగతి నాతో చెప్పకు నాతండ్రి పరువుని నాశనం చేయలేను! ఆయన గౌరవాన్ని దరిద్రానికి అహుతి కానీయలేను!’

‘అవును ఆనాడే ప్రసాద్ చెప్పాడు! నాదే తప్పు దరిద్రుని హృదయంలో ప్రేమ ఉండదని యిప్పుడు తెల్సుకున్నా ’

‘అది నీలాంటి ధనికురాలికి’

ఆమె చరాచరా వెళ్ళిపోయింది_ ఆమె వెళ్లిన వైపుకే చూస్తూఉన్నాడు! ఆమె మలుపుతిరగబోయి వెనక్కి తిరిగిచూచింది_ పిలుద్దామనుకున్నాడు ..కాని అతని ముసలితండ్రి అతని కళ్ళకు కట్టాడు; ఆలోచించాడు...నిజంగా పిలుద్దామను కున్నాడు! ఈసారి నిజంగా అతని తండ్రి ఒస్తున్నాడు. అతను యింట్లోకి వెళ్లాడు; ఆమె మలుపు తిరిగింది! తండ్రి వచ్చాడు_

‘నాన్నా! ఇచ్చారా...! నడిచే వచ్చారా? రిక్షా చేయించుకోలేక పోయారా?’

‘రిక్షా! నరవాహనం’ అయినా నాలుగణాలు అవుతుంది . అవి పెడితే రెండు కవర్లు వస్తాయి’ అని రెండు కవర్లు జేబులోవి తీశాడు...

‘అప్లికేషను రాయి యిదు...’ అని కవరిచ్చారు! శీతార్తులైమంచినీరు త్రాగేరు. గోవర్ధన్ నిట్టూర్పువిడుస్తూ గుమస్తాగిరికి అప్లికేషన్ పెట్టాడు.

అతను తనజీవిత రహదారిలో ఒకమలుపు తిరిగాడు ..అతని హృదయాకాశంలోని ఒక కారుమేఘం తొలగింది! దూరంనుంచి పాట వినవస్తోంది...

‘‘కనికరించే దైవమే మనపైన జాలిమానునా’ ఆ పాటవింటూ క్రిందని సంతకం చేసి కవరుపై అడ్రసు వ్రాసేడు.......